క్లుప్తంగా

జేఈఈలో ఆర్టీసీ డ్రైవర్ కుమారుడి ప్రతిభ



నర్సంపేట : ఆదివారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ నూనావత్ కిషన్ కుమారుడు మహేశ్ ఆల్ ఇండియా స్థాయిలో 395వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు. ఈ క్రమంలో మహేశ్‌ను, అతడి తండ్రి కిషన్‌ను ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూయూ నాయకుడు గొలనుకొండ వేణు, డిపో ఉద్యోగులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ నేడు (సోమవారం) జరగనున్న ఆన్‌లైన్ కౌన్సిలింగ్‌లో తనకు హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో సీటు తప్పకుండా వస్తుందని ధీమా వ్యక్తం చేశాడు.

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ



సంగెం : మార్గం స్వచ్ఛంద సేవా సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులకు దాత బిట్ల శ్రీయాన్స్ ఆదివారం ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం శ్రీయాన్స్ మాట్లాడారు. విద్యాదానం అత్యంత విలువైనదని చెప్పారు. విద్య అందిస్తే విద్యార్థులు భావిజీవితంలో ఉన్నత స్థానంలోకి చేరుతారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ సురేశ్, సింగారపు బాబు, బిట్ల అవనీశ్ కుమార్, వందన, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, దిడ్డి కోటేశ్వర్, శోభారాణి, శ్రావణ్, దివ్యశ్రీ పాల్గొన్నారు.

విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామ మాజీ సర్పంచ్ తౌటి దేవేందర్ ఆదివారం రూ.25 వేల 116 విరాళం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. ఆలయ నిర్మాణం అభినందనీయమని చెప్పారు. ఆలయ నిర్మాణ కమిటీకి దాతలు సహకరించాలని ఆకాంక్షించారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు సింగారపు ప్రవీణ్, ప్రదీప్‌లకు వారి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు గుర్రపు భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం రూ.10 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు వైనాల రాజేశ్, కోశాధికారి కందిక శేఖర్, గౌరవ అధ్యక్షులు బండారి సత్యం, వంగపండ్ల రాజు, మల్లయ్య, సుంకరి రాంప్రసాద్, సురేశ్, ఉప్పలయ్య, శివ, ప్రశాంత్, భాస్కర్, చిరంజీవి పాల్గొన్నారు.

11న విద్యుత్ పరిష్కార వేదిక

తొర్రూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ గుట్టయ్య తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

హన్మకొండ అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మొహమ్మద్ ముస్తాక్ నెహాల్ జన్మదిన సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వొచ్చన్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తలసేమియా బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం శిబిరంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు శ్రీనివాస్‌రావు, రెడ్ క్రాస్ జిల్లా సభ్యులు బిల్లా రమణారెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. శిబిరంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అటకెక్కిన ‘మన ఊరు-మన బడి’

● అసంపూర్తిగా మూత్రశాలలు, మరుగుదొడ్లు



కాట్రపల్లి హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు



సంగెం స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు



కాట్రపల్లిలో స్లాబ్ వరకు పూర్తి అయిన తరగతి గది

సంగెం : గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘మన ఊరు-మన బడి’ పథకం అటకెక్కింది. ఆ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దిశగా చేపట్టిన మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిబంధనల ప్రకారం 2023 ఫిబ్రవరి నాటికి పూర్తి కావాల్సి ఉండగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలు వెక్కిరిస్తున్నాయి. ఇక కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో చేపట్టని అభివృద్ధి పనులను అమ్మ ఆదర్శ కమిటీలతో చేయిస్తోంది. ఈనెల 12న ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో ‘మన ఊరు-మన బడి’లో చేపట్టిన మూత్రశాలలు, మరుగుదొడ్ల, ఇతర పనులను పూర్తి చేయించకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2 వేల 659 మంది విద్యార్థులు ఉండగా అందులో 1439 మంది బాలికలు, 1220 మంది బాలురు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల, మహిళా ఉపాధ్యాయుల సంఖ్యే ఎక్కువ అని గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకోగా కొన్ని పాఠశాలల్లో వాటిని కూల్చి 2023 ఏడాది ఫిబ్రవరిలో పునాదులు తీసి పనులు ప్రారంభించి సగంలోనే వదిలేశారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలతో 2023-24 విద్యాసంవత్సరాన్ని నెట్టుకొచ్చారు. అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులను నేటికి తిరిగి చేపట్టలేదు. కాట్రపల్లిలో అదనపు తరగతి గది స్లాబ్‌కే పరిమితమైంది. కాపుల కనిపర్తిలో పనులను మొదలు పెట్టనే లేదు. మొండ్రాయి, సంగెం, కాట్రపల్లి తదితర పాఠశాలల్లో మూత్రశాలల నిర్మాణం నిలిచిపోయింది.

అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో కొత్త పనులు

గత రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వం చేపట్టిన ‘మన ఊరు-మన బడి’ పనులు ఎక్కడిక్కడే నిలిచిపోగా తాజాగా అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో కొత్తగా పనులు అప్పగించి పూర్తి చేయిస్తోంది. కాగా గత ప్రభుత్వం ‘మన ఊరు-మన బడి’ కింద పాఠశాలల్లో చేపట్టిన మూత్రశాలలు, మరుగుదొడ్లు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి ‘మన ఊరు-మన బడి’లో చేపట్టి అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు వెంటనే పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు

ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే పనుల కొనసాగింపు



ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే ‘మన ఊరు-మన బడి’ కింద మండలంలో చేపట్టిన పనులు కొనసాగించగలము. ప్రభుత్వం నిర్ణయం తీసుకుని నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులు కొనసాగించలేము. ఇక పాఠశాలల్లో మొదలు కాని పనులను అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదిక చేయిస్తున్నాం.

-నక్క విజయ్‌కుమార్, ఎంఈఓ, సంగెం

పాకాలలో నిఘా నేత్రాలు



ఎంట్రీ గేట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఖానాపురం : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన వరంగల్ జిల్లాలోని పాకాలలో నిఘా నేత్రాలు ఏర్పాటయ్యాయి. ఇటీవల కాలంలో అటవీ శాఖ అధికారులు సీసీ కెమెరాలు బిగించారు. అటవీ శాఖ అధికారులు సోలార్‌తో కూడిన సీసీ కెమెరాలను గేట్ ఎంట్రీతో పాటు కట్ట ప్రదేశంలో మూడు నుంచి నాలుగు కెమెరాలను ఏర్పాటు చేశారు. పాకాలకు వచ్చే పర్యాటకుల నమోదుతోపాటు గేట్ల వద్ద సిబ్బంది పని తీరును నిత్యం పర్యవేక్షించడానికి వీలుగా చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. ప్రతీరోజు పర్యవేక్షించేలా సీసీ కెమెరాలను ఉన్నతాధికారుల సెల్‌ఫోన్లకు లింక్ చేసినట్టు సమాచారం.

అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట

పాకాల పర్యాటక ప్రాంతంలో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారంటూ ప్రజలు, పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాకాల అందాలను తిలకించడానికి వచ్చే ప్రేమికులు కొంత ఇబ్బంది పడుతున్నట్టు కనపడుతోంది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా ప్రభుత్వానికి ఆదాయమూ తగ్గినట్టు తెలుస్తోంది.

గేట్లు తొలగించాలి

పాకాల అందాలను తిలకించడానికి వచ్చే జనం ప్రారంభ ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఎంట్రీ గేట్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ప్రవేశం కోసం ఫీజు చేయించాల్సి రావడం పట్ల ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. పాకాలను పర్యాటకంగా అభివృద్ధి చేయకుండానే ఎంట్రీ ఫీజు భారీగా వసూలు చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చక్కర్లు కొడుతున్నాయి. పలువురు బహిరంగంగానే మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఎంట్రీ ఫీజులను, గేట్లను తొలగించాలని పర్యాటకులు, ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



నల్లబెల్లి : సంబరాలు జరుపుకుంటున్న నాయకులు



వర్ధన్నపేటలో..



గీసుకొండ : మొగిలిచర్లలో..

నల్లబెల్లి : దేశ ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో బీజేపీ నాయకులు మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు తడుక అశోక్ గౌడ్, మండల అధ్యక్షుడు బొడ్డిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్ గౌడ్, యువ మోర్చ మండల అధ్యక్షుడు సుదగాని ప్రమోద్, నాయకులు బోళ్ల నారాయణ, ఇంగోలి రాజమల్లు, నాగిరెడ్డి రాజిరెడ్డి, ఆమ్‌సింగ్, కడియాల విజయ్, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చుతూ సంబురాలు నిర్వహించారు. బీజేపీ జిందాబాద్, జై శ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కుమారస్వామి, యాకయ్య, రాజు, రవి, సుభాశ్, దేవేందర్, సత్యం, అనిల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15, 16 డివిజన్లలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, డివిజన్ అధ్యక్షులు బిల్ల రమేశ్, గోదాసి అశ్వినికుమార్ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

కొమ్మ కత్తిరింపులతో అధిక దిగుబడి

● మామిడిలో యాజమాన్య పద్ధతులపై ఉద్యాన శాఖ అధికారి రమేశ్ సూచనలు



చెన్నారావుపేట : జిల్లాలోని పలు ప్రదేశాల్లో రైతులు మామిడి తోటలు ఏర్పాటు చేసుకున్నారు. మామిడి కోతలు కూడా పూర్తి కావస్తున్నాయి. వచ్చే సీజన్‌కు రైతులు ఎక్కువ దిగుబడి సాధించాలంటే కోతలు పూర్తి కాగానే కొమ్మ కత్తిరింపులు తప్పదు. ఇందుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యాన శాఖ అధికారి దయ్యాల రమేశ్ పలు సూచనలు చేశారు.

కత్తిరింపులు ఎందుకు?

సాధరణంగా కొత్త కొమ్మల మీద వచ్చే పూత పండ్ల మొక్కల్లో చాలా ముఖ్యమైనది. కొమ్మలు కత్తిరించిన తర్వాత కొత్తగా పుట్టుకొచ్చే కొమ్మలపై పూత వస్తుంది. మామిడిలో చాలా కాలంగా, చాలా రకాల్లో మార్చికి ముందు పుట్టిన కొమ్మలపై డిసెంబర్-జనవరి నెలల్లో పూత వస్తుంది. అందువల్ల మామిడి చెట్లలో కొమ్మ కత్తిరింపులతో ఫలితం ఉండదనే భావన రైతుల్లో ఉంది. జన్యు పరంగా మామిడి ఆకులు కిరణజన్య సంయోజన క్రియకు అవసరమైన శక్తిని సూర్య రశ్మి నుంచి గ్రహించడంలో జామ, సీతాఫలం వంటి మొక్కలతో పోలిస్తే చాలా తక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. సూర్యరశ్మి బాగా తగిలితే (ఎక్కువ శాతం ఆకులు నీడలో ఉంటాయి) ఈ సామర్థ్యం మరీ తగ్గుతుంది. ఫలితంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

కొమ్మ కత్తిరింపుతో మామిడిలో మార్పులు

సీ-రేషియో కొమ్మలు కత్తిరించడంతో సూర్యరశ్మి చెట్టులోకి బాగా ప్రసరించి ఆకులకు సోకి, కిరణజన్య సంయోజన క్రియ బాగా జరిగి ఎక్కువగా పిండి పదార్థాలను తయారు చేసుకుంటుంది. వీటి నిల్వలు పెరగడం వలన నత్రజని నిల్వలు తగ్గుతాయి. ఈ విధంగా అధిక పిండి పదర్థాలు, తక్కువ నత్రజని (సీఎన్) ఉండటంతో పూత రావడానికి అవసరమైన పరిస్థితులు చెట్టుకు కలుగుతాయి.

శ్వాసక్రియ

కొమ్మల కత్తిరింపు వల్ల మామిడి చెట్ల ఆకుల్లో జిబ్బరిల్లిన్ మాదిరి రసాయనాలు కత్తిరించని ఆకుల్లో కంటే తక్కువగా ఉంటాయి. అందువల్ల పూత తొందరగా వస్తుంది. ఈ చర్యలతోపాటు వివిధ రసాయన చర్యలు జరిగి మామిడి తొందరగా పూత రావడానికి దోహద పడతాయి.

కొమ్మ కత్తిరింపు విధానం

కాయలను కోయడం మే నెలాఖరు వరకు అన్ని తోటల్లో పూర్తి అవుతుంది. కాయలు కోసిన తర్వాత చెట్లకు 20-25 రోజులు విశ్రాంతి ఇవ్వాలి. ఎండిన పూత కాడల (కొరడాలు) ద్వారా ఎండు తెగులు వ్యాపించే ప్రమాదం ఉన్న క్రమంలో వాటిని తొలగించాలి. పాడి పశువులకు అడ్డం లేకుండా నేలను తగులుతున్న, అడ్డదిడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించాలి. తర్వాత చెట్టుపై భాగం మధ్యలో ఉండే కొమ్మలను తొలగించాలి. తద్వారా సూర్యరశ్మి చెట్టు మొత్తాన్ని ఆకర్శిస్తుంది. కత్తిరింపు చేపట్టిన వెంటనే ఎకరానికి 60 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేయాలి. కొమ్మలు కత్తిరించడంతో కొత్తగా వచ్చిన చిరుకొమ్మలు 4-5 నెలలు ముదిరి పూతకొస్తాయి. జూన్-జూలైల్లో ప్రతి బంగినపల్లి రకం మొక్క చిన్న కొమ్మలను 10 సెంటీమీటర్ల వెనక్కు కత్తిరించాలి. (అంటే కత్తిరించేటప్పుడు ఆకుల సముదాయం (గుంపు) ఉన్న చోటికి ఒక అంగుళం పైకి కత్తిరించాలి. దీంతో ప్రతీ కత్తిరించబడిన భాగం నుంచి 3-5 కొత్త చిగుళ్లు పుడతాయి. ఈ విధంగా ఒక్కో కొమ్మకు బదులు 3-4 చిన్న కొమ్మలను అభివృద్ధి చేస్తే అవి నాలుగు నెలలు (ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్) ముదిరి నవంబర్-డిసెంబర్‌లో ఎక్కువగా పూత రావడానికి అవకాశం ఉంది. ఈ విధంగా చేసిన తర్వాత (కొత్త చిగురు తొడగిన తర్వాత చెట్టంతా తడిసేలా ఎకరానికి 500 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిపాస్, ఎకరానికి 200 లీటర్ల నీటిలో కిలోన్నర ఫార్ములా-4 ఎకరానికి కలిపి సుమారు 10 సంవత్సరాలు దాటిన చెట్టుకు 8-10 లీటర్ల మందు ద్రావణం పడేలా పిచికారీ చేయాలి.



కొమ్మలను కత్తిరింప చేస్తున్న రైతులు

ఎరువుల యాజమాన్యం

పదేళ్లకు పైబడిన ఒక్కో మొక్కకు 2 కిలోల యూరియా, 5 కిలోల సూపర్, కిలో పొటాష్ కలిపి పాదుల్లో పోసి మట్టి కప్పాలి.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను తెరిపించండి



మూసిఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ ఆరు నెలలుగా మూసివేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్‌ను రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీపీ అధికారులను పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎలక్షన్ కోడ్ ఉందని దాటవేత ధోరణి అవలంభించిన అధికారులూ.. ఇప్పటికైనా వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేపించి ప్రజలకు రూ.2కే నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలని కోరుతున్నారు. జీపీ అధికారులు పట్టించుకోని పక్షంలో ఈ సమస్యను మండల, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాలివ్వాలి

కాశిబుగ్గ: గత ప్రభుత్వంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వెంటనే రుణాలను వారి ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ దళిత నిరుపేద అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల యాదగిరి డిమాండ్ చేశారు. ఓ సిటీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 -2021వ ఆర్థిక సంవత్సరంలో గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా ఇంతవరకు వారికి రుణాలు ఇవ్వలేదన్నార రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అభయ హస్తం పథకం కింద దళితులకు రూ.12 లక్షలు ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలుచేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.


పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 17 ఏళ్ల అనంతరం ఒకచోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. నాడు విద్యాబోధన అందించిన ప్రధానోపాధ్యాయుడు పిన్నింటి కిషన్‌రావు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.సత్యం, ఉపాధ్యాయులు ఎంఎస్.రావు, నర్సింహారావు, శ్రీహర్షుడు, లెనిన్‌లను ఘనంగా సన్మానించారు.

ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టాలి



తొర్రూరు: మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

తొర్రూరు: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోతు సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టానికి ప్రైవేటు పాఠశాలలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా 25శాతం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అమీర్, జ్యోతిబసు, గుండ్ల రాకేష్, ద్రావిడ్, చరణ్, వినయ్ పాల్గొన్నారు.

గార్ల: ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నందున, ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ మండల కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ డిమాండ్ చేశాడు. ఆదివారం గార్లలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేయడంతోపాటు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, టై, బెల్ట్‌లు, అడ్మిషన్లు ఫీజుల పేర దోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాగరాజు, ఆకాష్, చింటు, పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.

కాలజ్ఞానాన్ని ప్రచారం చేయాలి

హన్మకొండ కల్చరల్: కులమతాలకతీతంగా బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని ప్రచారం చేయాలని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మునిమనవడు నొస్సం వెంకటాద్రి స్వామి అన్నారు. భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి, అర్చకుడు గూటోజు కేదారేశ్వచారి శిష్యబృందం పూర్ణకుంభంతో స్వాగతించి పాదపూజ చేశారు. కార్యక్రమంలో కొక్కొండ శంకరయ్య, వేల్పుల దేవాచారి, తాటికొండ మల్లేషం, రమణాచారి, కొండోజు వీరాచారి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా హోంలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాశిబుగ్గ: టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గ మదర్ థెరిస్సా హోమ్‌లో అనాథలకు, క్రిస్టియన్ కాలనీలో పేదలకు వేర్వేరుగా కాంగ్రెస్ నాయకులు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. క్రిస్టియన్‌కాలనీలో జరిగిన వేడుకలకు సినీ నిర్మాత శ్యామల గణేష్, డాక్టర్ మోహన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజయ్యారు. కార్యక్రమాల్లో నాయకులు సందెల లాజర్, గూడ శారద, గూడ గోవర్దన్, జంగం ప్రభాకర్, పోలెపాక విశాల్, కట్కూరి అన్వేష్, పుష్ప, సురేష్, మడిపల్లి అమృత్‌రావు, విజయలక్ష్మి, రేణుక, విజయ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను పేర్కొనాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరగుతున్న బదిలీలు, పదోన్నతుల కోసం తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలు, స్పౌజ్ కేటగిరీ పత్రాలు సమర్పించిన వారిని తొలగించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించి పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు పల్లె శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.